క్లుప్తంగా

చదువే భవితకు ఉన్నతి



దాచేపల్లి : బాలికలు చదువుకుని ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ సీహెచ్. వరలక్ష్మి అన్నారు. నడికుడి ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సదర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. బాలికలు చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందని, చదువు ద్వారానే అన్ని రంగాల్లో రాణించగలుగుతారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, శ్రీలక్ష్మి, మాణిక్యం, శివకుమారి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ఆమోదం తప్పనిసరి



గురజాల : ప్రతి ఒక్క రాజకీయ పార్టీ ఆమోదంతోనే ముందుకు వెళ్తామని రెవెన్యూ డివిజనల్ అధికారి రమణాకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల మార్పు గురించి చర్చించారు. మౌలిక వసతులు గురించి చర్చించారు. పలు పోలింగ్‌కేంద్రాల్లో మార్పులు వాటిని మార్పు చేయుటకు గల కారణాల గురించి చర్చించారు. పోలీస్ అధికారులు 304 పోలింగ్ కేంద్రాల్లో 171 పోలింగ్ కేంద్రాలను క్రిటికల్‌గా ఉన్నట్లు గుర్తించారన్నారు. వాటిల్లో ఎలక్షన్ కోరకు సెక్యూరిటి పెంచడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గురజాల : మండలంలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఆ శాఖ ఏడీఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. 33/11 కేవీ పళ్లపాడు నుంచి విద్యుత్ లేన్ హైవే పనులు చేపడుతున్న సందర్భంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

శావల్యాపురం: ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నక్కా లక్ష్మీ లావణ్య తెలిపారు. కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. నూతన ఓటుహక్కు దరఖాస్తులు, తొలగింపులు మార్పులు, చేర్పులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని చెప్పారు. నేటి వరకు వివిధ రకాల ఓట్లు దరఖాస్తులు 320 పెండింగ్‌లో ఉన్నాయని, అవన్నీ క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమగ్ర ఆధారాలు అందజేసిన వారికి ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. రెండు రోజుల వ్యవధిలో దరఖాస్తులన్నీ నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్‌వోలపై ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల్ని ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పెరిసోముల నాసరయ్య పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

యడ్లపాడు: ప్రణాళికాబద్ధంగా చదివిన వారు మానసిక ఒత్తిడిని జయిస్తారని..ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అది ఎంతో దోహదపడుతుందని పారిశ్రామికవేత్త రావూరి నాగేశ్వరరావు చెప్పారు. గుంటూరుకు చెందిన డీఎస్‌ఆర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మండలంలోని లింగారావుపాలెం జెడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఆర్ సర్కిల్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ సర్కిల్ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి సర్కిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దామచర్ల శ్రీనివాసరావు, జంపాల శివబాబు, ఎస్‌ఎం చైర్మన్ షేక్ మీరావలి, నంబూరి శివరామకృష్ణయ్య, తోకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైసెన్సుల రెన్యువల్, రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వినుకొండ టౌన్: వ్యాపారస్తులంతా దుకాణాల లైసెన్స్‌లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని గుంటూరు ఉప కార్మిక కమిషనర్ ఎ. గాయత్రి సూచించారు. పట్టణంలోని ఎన్‌ఎస్పీ కాలనీలో గల సహాయ కార్మిక అధికారి కార్యాలయంలో శనివారం వర్తక, వ్యాపార సంస్థల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దుకాణ సంస్థల చట్టం – 1988 అనుసరించి దుకాణాల లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు రెన్యువల్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

సరిహద్దు లేని సంక్షేమం, అభివృద్ధి

- తెలుగు రాష్ట్రాల సరిహద్దు పంచాయతీలో సంక్షేమ వెలుగులు
- అభివృద్ధికి కేరాఫ్ పొందుగల గ్రామం

దాచేపల్లి : ఒకప్పటి తెలుగుదేశం పార్టీ కంచుకోట పొందుగల గ్రామం నేడు వైఎస్సార్ సీపీకి పెట్టని కోటగా మారింది. ప్రతి ఎన్నికల్లో 300ఓట్ల మెజార్టీ ఇస్తూ వస్తున్న పంచాయతీని గత ప్రభుత్వం విస్మరించినా.. ప్రస్తుత ప్రభుత్వం నిరంతరం ప్రజలు స్మరించుకునేలా సంక్షేమం, అభివృద్ధిని అందించింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 100 ఓట్ల మెజార్టీ ఇచ్చిన నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా.. రూ.14 కోట్ల సంక్షేమం, రూ.8.50కోట్ల మేర అభివృద్ధిని అందించి ప్రజాభిమాన్ని చూరగొంది. ఏపీ, తెలంగాణ సరిహద్దు గ్రామం పొందుగల. ఈ పంచాయతీ పరిధిలో శ్రీనివాసపురం గ్రామం ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల పథకాల ద్వారా రూ.14 కోట్ల మేర గ్రామ ప్రజలకు లబ్ధి చేకూరింది. రూ.8.50 కోట్ల మేర అభివృద్ధి జరిగింది. 3 వేల మంది జనభా కలిగిన పొందుగల పంచాయతీలో దాదాపు 2,100 మంది ఓటర్లు ఉన్నారు.



పొందుగల గ్రామ సచివాలయ భవనం



నూతనంగా నిర్మించిన ఈద్గా



రైతు భరోసా కేంద్రం



డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

అభివృద్ధి చేసి చూపించాం



పొందుగల గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక.. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం పనులు చేశాం. ప్రతి కుటుంబం ప్రభుత్వం పథకాల లబ్ధి పొందింది. గ్రామంలోని సమస్యలన్నీ దాదాపుగా పరిష్కరించాం. గత ప్రభుత్వంలో జరగని అభివృద్ధిని చేసిచూపించాం.

– షేక్ ఇమామ్‌వలి, సర్పంచ్, పొందుగల.

గతంలో ఎన్నడూ లేదు..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగినన్ని మంచి పనులు గత ప్రభుత్వంలో జరగలేదు. పార్టీలు, కులాలకు అతీతంగా నాతో పాటు ప్రతి ఇంటికి జగనన్న మంచి చేశాడని గుండెల మీద చేయి వేసుకుని ధైర్యంగా చెబుతాం.

– తండా జానీ పొందుగల.

కుటుంబానికి అండ



సంక్షేమ పథకాలు మా కుటుంబానికి అండగా నలిచాయి. ప్రతి నెల 3వేలు పింఛను కానుక వస్తోంది. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ బాగా పనిచేస్తోంది. మాకు అండగా ఉన్న జగనన్నకి మేమూ అండగా ఉంటాం.

– షేక్ బాజి, పొందుగల.

అభివృద్ధి పరుగులు

- పొందుగుల గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పరుగులు పెడుతోంది.
- ఇక్కడ రూ.28లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 22లక్షలతో ఆర్బీకే, రూ.22 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మించారు.
- ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించేందుకు రూ.1.20 కోట్లతో పైపులైను పనులు చేపట్టారు.
- రూ 1.20 కోట్లతో సిమెంట్ రోడ్లు, రూ.30 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు.
- ముస్లింల చిరకాల కల ఈద్గాను రూ.20లక్షలతో నిర్మించారు.
- రూ.30లక్షలతో మనబడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలను ఆధునీకరించారు.
- రూ.5కోట్లు విలువ చేసే భూమిలో జగనన్న కాలనీ ద్వారా 360 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చారు.
- ముస్లింలు, కాపులు ఎక్కువగా ఉండే ఈ గ్రామంలో సంక్షేమం పథకాలు ప్రతి ఇంటికి అందాయి.



గ్రామంలో సిమెంట్ రోడ్డు

బాధితులకు పీఆర్కే నగదు సాయం



బాధితులకు నగదు అందజేస్తున్న నాయకులు

వెల్దుర్తి: హనుమాపురం తండాకు చెందిన మండ్లి సురేష్ అనే వ్యక్తి పూరిల్లు మూడు రోజుల క్రితం దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు గంగలకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సబ్బసాని కోటిరెడ్డి బాధితులకు రూ. 30వేల నగదు శనివారం అందజేశారు. పీఆర్కే తన సొంత నిధులు బాధితులను ఆదుకునేందుకు అందజేశారన్నారు. సర్పంచ్‌లు జల్లి అంజి, మాజీ సర్పంచ్‌లు కాటంరాజు, బాణావత్ శ్రీనునాయక్, మంత్రునాయక్, ఆర్.లక్ష్మణనాయక్, నాయకులు మేడబోయిన కృష్ణ, గోళ్ళ యర్రబ్బాయ్, అనంతరామిరెడ్డి, సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

గురజాల : బాల్య వివాహాల నివారణపై మహిళలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి అన్నారు. నగర పంచాయతిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బేటి బచావో..బేటి పఢావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహం చేస్తే.. భవిష్యత్‌లో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 18 ఏళ్ల నిండిన అనంతరమే వివాహం చేయాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

వైద్య రంగంలో అత్యున్నత ప్రమాణాలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- సీహెచ్‌సీ, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం



కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారులు, సిబ్బందితో ప్రభుత్వ విప్ పీఆర్కే

విజయపురిసౌత్: పేద కుటుంబాలు ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అత్యంత ప్రాధన్యం ఇచ్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండలంలోని విజయపురిసౌత్ గ్రామంలో నూతనంగా రూ.5.32కోట్లతో అత్యాధునికి సౌకర్యాలతో నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం–1, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బీవీ రంగారావు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ కేపీ చారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి వ్యవహరించారు. ఈ ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ 14 ఏళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన మాజీ సీఎం చంద్రబాబు వైద్య, విద్యా రంగాలను అభివృద్ధి చేయలేదన్నారు. అధికారంలోకి రావాలని, టీడీపీ నాయకులకు దోచి పెట్టాలని ఆలోచించటం తప్ప పేదల సంక్షేమం కోసం ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టని ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మాచర్ల నియోజకవర్గంలో రూ.20 కోట్ల నిధులు వివిధ ఆసుపత్రులకు మంజూరు చేసినట్లు తెలిపారు. విజయపురిసౌత్‌లోని కమ్యూనిటీ సెంటర్‌లో పేద ప్రజలకు విశేషంగా సేవలు అందిస్తున్న జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మిని పీఆర్కే అభినందించారు. పీఆర్కేను వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. దీనికి ముందు విజయపురిసౌత్ టీ–జంక్షన్‌కు చేరుకున్న పీఆర్కేకు పార్టీ నాయకులు ఘనంగా ఆహ్వానించి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాచర్ల ఎంపీపీ బూడిద మంగమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరావు, మండల నాయకులు బూడిద శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్ వెంకట్రావమ్మ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మాచవరం: మల్లవోలు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి 32వ కల్యాణ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దంపతులు పీటలపై కూర్చొని, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ పూజారులు స్వామి వారి కల్యాణ విశిష్టతను భక్తులకు తెలియజేశారు. వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవం సందరంభంగా విచ్చేసిన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవం సందర్భంగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శ్రీలక్ష్మినరసింహాస్వామిని దర్శించుకొని, పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ పురోహితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల విన్నపం మేరకు స్వామి వారి ఆశీస్సులతో దేవస్థానం నందు కల్యాణ మండపం నిర్మించడం జరిగిందని తెలిపారు. మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందకు ప్రజల దీవెలను, స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సీహెచ్ సింగరయ్య, గ్రామ పెద్దలు డేవిడ్, బ్రహ్మయ్య, నాగు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే..



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి అంజనీ కుమారి

పిడుగురాళ్ల: దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని తెలంగాణ రాష్ట్ర సీఎంసీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ వీపీ అంజనీ కుమారి తెలిపారు. పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఎస్సీ బాలికలు, ఎస్సీ బాలురు, ఎస్టీ బాలికల వసతి గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అందించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ నిర్వాహకురాలు, తెలంగాణ రాష్ట్ర సీఎంసీ కోర్టు సీనియర్ సూపరిండెంట్ వీవీపీ అంజనీ కుమారి మాట్లాడుతూ పేదరికం అబ్దుల్ కలాంకు అడ్డురాలేదని, అలాగే ప్రతి విద్యార్థి పెద్దలను ఆదర్శంగా తీసుకోని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు. అనంతరం 44 మంది విదార్థులకు పదోవ తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ జీఎల్ నరసింహారావు, గురజాల వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ సుజాత కుమారి, హెచ్‌డబ్ల్యూవోలు గోపి నాయక్, మాధవి లత, వనజా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణను వివరిస్తున్న పర్యావరణ వేత్త అంకారావు

కారెంపూడి: అడవులను రక్షించుకోవడంతో 84 లక్షల జీవరాసులను కాపాడుకోగలుగుతామని, మానవ మనుగడ కూడా ఆరోగ్యకరంగా కొనసాగుతుందని పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) పేర్కొన్నారు. ప్రసిద్ధ సింగరుట్ల లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో ప్రకృతి ఆధ్యాత్మికం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సమస్త జీవరాసులకు ఆవాసాలు వృక్షాలని.. వాటిని మనం కాపాడుకుంటే అవి మనల్ని కాపాడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తక్షణ కర్తవ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి వెంకట రమణాచార్యులు మాట్లాడుతూ కొమెర అంకారావు కార్యక్రమాలకు చేయూత నివ్వాలని కోరారు. అనంతరం కారెంపూడి సాయిబాబా గుడిలో ప్రకృతి ఆధ్యాత్మికం కార్యక్రమం జాజి నిర్వహించారు. పల్నాడులోని పలు ఆలయాలను, పాఠశాలలను వేదికలుగా చేసుకుని, పర్యావరణ పరిరక్షణ తక్షణ ఆవశ్యకతను వివరిస్తున్నారు.

హామీలు నెరవేర్చిన జననేత సీఎం జగన్

దుర్గి: మండలంలోని కోలగుట్ల గ్రామంలో రూ.40లక్షలలో నిర్మించిన సచివాలయం, రూ. 21లక్షలతో నిర్మించి ఆర్బీకే భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. మహిళలు గుమ్మడికాయతో దిష్టి తీసి, స్వాగతం పలికారు. గతంలో లేనంతగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 2,350కోట్ల నిధులు నియోజకవర్గంలోని ప్రజలు వివిధ పథకాల కింద లబ్ధిపొందారన్నారు. కేవలం కోలగుట్ల గ్రామంలోనే రూ.12కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఎంపీపీ ఏచూరి సాయి శంకర్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాస్, సర్పంచ్ మద్దికర శ్రీనివాస్‌రెడ్డి , ఎంపీటీసీ నక్కా ఆదినారాయణ, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించాలి



ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు

రెంటచింతల: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని తహసీల్దారు ఎస్. రామ్ మోహన్‌రావు అన్నారు. శనివారం మిట్టగుడిపాడు, గోలి, పశర్లపాడు, జెట్టిపాలెం, పాలువాయి, తుమృకోట గ్రామాల్లోని 21 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, ప్లైగ్‌లు పెట్టుకునే అవకాశం ఉందా లేదా, సరిపడ వెలుతురు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల సౌకర్యం, వృద్ధులకు ఏర్పాటు చేసిన ర్యాంప్‌లను పరిశీలించాలని చెప్పారు. కనీస సౌకర్యాలు లేని పోలింగ్ కేంద్రాల వద్ద వెంటనే ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక రెవిన్యూ అధికారులకు సూచించారు. అవసరమైతే పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లను కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు పల్లా రామకృష్ణ, కె. బాలయ్య, పాపారావు, జానయ్య, పోలింగ్ బూత్‌లెవల్ పాల్గొన్నారు.

బెంగళూరుకు సూపర్ లగ్జరీ సర్వీసు ప్రారంభం

వినుకొండ టౌన్: నరసరావుపేట నుంచి వినుకొండ మీదుగా బెంగళూరుకు సూపర్ లగ్జరీ సర్వీసును నూతనంగా ప్రారంభించినట్లు వినుకొండ డిపో మేనేజర్ బాణావతు కోటేశ్వరరావు నాయక్ శనివారం తెలిపారు. ఈ సర్వీసు నరసరావుపేటలో సాయంత్రం 4.30లకు బయలుదేరి వినుకొండకు 5.20గంటలకు చేరుకుంటుందని చెప్పారు. డిపోలో 5.45 గంటలకు బయలుదేరి కుంట, మార్కాపురం, కంభం, కొమరోలు, పోరుమామిళ్ళ, మైదుకూరు, కడప, రాయచోటి, మదనపల్లి, యస్. కోట మీదుగా మరుసటి రోజు ఉదయం 6.30గంటలకు బెంగళూరు చేరుకుంటుందని వివరించారు.

భూ సంస్కరణలకు నాంది పలికిన సీఎం వైఎస్ జగన్

పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కోలగుట్లలో మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: డీకే పట్టాల భూములకు సర్వహక్కులు కల్పించి, సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం శనివారం మండలంలోని కోలగుట్ల గ్రామంలోని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన 323 మంది రైతులకు 459.50 యకరాల భూమికి సంబంధించిన డీకే పట్టాల నుంచి సర్వహక్కులు కల్పిస్తూ భూ పత్రాలను పిన్నెల్లి అందజేశారు. 420 మంది నిరుపేద అక్కాచెల్లెమ్మలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగు దేశం ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలు ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. కేవలం వారి బినామీలకు, నాయకులకు పెద్ద ఎత్తున ప్రజా ధనాన్ని లూటీ చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో రూ. 2.50లక్షల కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందని గణాంకాలతో తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ సేవలను పొందేందుకు గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లీనిక్‌లను నిర్మించటం అభివృద్ధి కాదా అని ఆయన టీడీపి నేతలను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, చింతా నరసింహారావు, పిఆర్‌ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీలు చింతా శివరామయ్య, తహసీల్దార్ రజనీకుమారి, ఎంపీడీఓ జీఎల్‌ఎన్ గుప్తా, వైఎస్సార్‌సీపీ నాయకులు నాలి రామయ్య, నలబోతు చిన్నబ్బాయ్, జంగా యలమంద, కొత్త వెంకటేశ్వర్లు, రాయపాటి మాణిక్యం, గొరెడ్డి వెంకటరెడ్డి, బొంతా కృష్ణ ఉన్నారు.

నూరు శాతం పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో పుట్టా రమణయ్య

యడ్లపాడు: ఇంటి పన్నుల వసూళ్లను మార్చి 30వ తేదీ నాటికి వంద శాతం వసూలు చేయాలని నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి పుట్టా రమణయ్య ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇంటిపన్ను వసూళ్లపై ఈవోపీఆర్‌డీ వరూధినిని ఆరా తీశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 12,500 నివాసాలకు గానూ రూ.1.46 కోట్ల డిమాండ్ ఉందని, వాటిలో రూ.97,92,839తో రమారమీ 40శాతం వసూలు పూర్తి చేసినట్లు డీఎల్‌పీవోకు తెలిపారు. వీటిని వచ్చే నెలాఖరుకు వందశాతం పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ 15వ ఆర్థిక సంఘ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)తో పాటు గత రెండేళ్ల జీపీడీపీ అనుబంధ ప్రణాళికల్ని సిద్ధం చేయాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్ని నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాలని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అనంతరం పన్నుల వసూళ్లు, జీపీడీపీ ప్రణాళిక తయారీపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని గుమస్తా మృతి



గౌస్‌పాషా (ఫైల్)

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గుమస్తా మృతి చెందిన సంఘటన గణపవరం జాతీయ రహదారి సీఆర్ కళాశాల ఎదురుగా శనివారం చోటు చేసుకుంది. విజయవాడ భవానీపురానికి చెందిన షేక్ గౌస్‌పాషా (41) అక్కడే ఓ పండ్ల దుకాణంలో గుమస్తాగా పని చేస్తుంటాడు. యజమాని సూచన మేరకు శనివారం ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేటలోని పండ్ల వ్యాపారుల వద్ద నగదు వసూలుకు వచ్చాడు. తిరిగి విజయవాడకు వెళ్తుండగా గణపవరం సీఆర్ కళాశాల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గౌస్‌పాషా రోడ్డుపై పడగా, వాహనం వెనుక టైరు తలపైకి ఎక్కింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న నాదెండ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికుల సమాచారంతో బంధువులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని భోరున విలపించారు.